సాక్షి
కాకినాడ

శుక్రవారం । 11 । ఏప్రిల్ । 2025



అశ్వ రాజసం

గొల్లప్రోలు మండలం చేబ్రోలు గ్రామంలో శుక్రవారం రాష్ట్ర స్థాయి గుర్రపు పందాలు నిర్వహిస్తున్నారు. దీనికి వివిధ ప్రాంతాల నుంచి గుర్రాలను తీసుకువచ్చారు.


8లో



జీడి పప్పు పరిశ్రమలకు హై ఓల్టేజీ

హైఓల్టేజీ కారణంగా సఖినేటిపల్లి మండలం మోరిపోడులో బుధవారం రాత్రి పలు జీడిపప్పు పరిశ్రమలకు నష్టం వాటిల్లింది. ఈ ప్రమాదంలో విలువైన జీడిపప్పు మాడిపోయింది.

సాగుకు 8,900 క్యూసెక్కులు



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి గోదావరి డెల్టా కాలువలకు గురువారం 8,900 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ఇందులో తూర్పు డెల్టాకు 2,200, మధ్య డెల్టాకు 1,700, పశ్చిమ డెల్టాకు 5 వేల క్యూసెక్కుల చొప్పున వదిలారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 10.10 అడుగులకు చేరింది.

న్యూస్‌రీల్

శత్రువుకు దడ పుట్టేలా..



యుద్ధ నౌకపై నుంచి రివ్వున దూసుకుపోతున్న యుద్ధ విమానాలు

కాకినాడ రూరల్: శత్రువుకు దడ పుట్టేలా ఇండో – అమెరికన్ టైగర్ ట్రయంఫ్–25 విన్యాసాలు కాకినాడ తీరంలో జరుగుతున్నాయి. ఇరు దేశాలకు చెందిన వైమానిక దళాలు గురువారం సంయుక్త విన్యాసాలతో అదరగొట్టాయి. సాధారణ ప్రజలకు అనుమతి లేనప్పటికీ ఈ విన్యాసాలు చూసేందుకు పలువురు ఆసక్తి చూపుతున్నారు. గురువారం ఉదయం యుద్ధ విమానాలు, హెలికాప్టర్‌లు కాకినాడ తీర ప్రాంతంతో పాటు సూర్యారావుపేట, వలసపాకల, వాకలపూడి గ్రామాల్లో చక్కర్లు కొట్టాయి. ఆకాశం నుంచి పెద్ద శబ్దం రావడంతో ఇళ్లలోని వారు బయటకు వచ్చి, వాటిని ఆసక్తిగా తిలకించారు. ఇండియన్ ఎయిర్ ఫోర్స్ 157హెచ్‌యూకు చెందిన ఎంఐ–17వీ5 ద్వారా 16 మంది యూఎస్ స్పెషల్ ఫోర్సెస్, గరుడ, పారా కమాండోలను యాంఫిబియస్ విన్యాసాలు జరిగే కాకినాడ బీచ్‌లోని నావెల్ ఎన్‌క్లేవ్ వద్ద బీచ్ ల్యాండింగ్ జోన్(ఎల్‌జెడ్)కు చేర్చారు. బీచ్‌లోకి సందర్శకులు రాకుండా పోలీసులు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశారు.

రైతులకు మద్దతు ధర అందేలా చర్యలు : జేసీ రాహుల్ మీనా



సిబ్బందికి సూచనలు చేస్తున్న జేసీ రాహుల్ మీనా

సాక్షి ఇంపాక్ట్

పిఠాపురం: ఏ ఒక్క రైతూ మద్దతు ధర కంటే తక్కువకు ధాన్యం అమ్ముకుని నష్టపోకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా అధికారులను ఆదేశించారు. ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంతో ప్రైవేటు వ్యాపారులు సిండికేటుగా మారి రైతుల నుంచి తక్కువ రేటుకు ధాన్యం కొనుగోలు చేస్తూ, దోచుకుంటున్న వైనంపై ఈ నెల 9న 'దోపిడికే ప్రాధాన్యం' శీర్షికన 'సాక్షి' ప్రచురించిన కథనానికి ఆయన స్పందించారు. జిల్లా పౌరసరఫరాల అధికారి ఎండీ నాయక్, డీసీఓ మురళీకృష్ణ, మండల వ్యవసాయ అధికారి అచ్యుతరావు తదితరులతో కలిసి జేసీ గురువారం గొల్లప్రోలు ఎంపీడీఓ కార్యాలయంలోని గొల్లప్రోలు–1 రైతు సేవా కేంద్రాన్ని సందర్శించారు. ధాన్యం కొనుగోలుపై గ్రామ వ్యవసాయ సహాయకులు, సిబ్బందితో మాట్లాడారు. ఈ సందర్భంగా జేసీ రాహుల్ మీనా మాట్లాడుతూ, వెంటనే ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి, కొనుగోళ్లు ప్రారంభించాలని సిబ్బందికి సూచించారు. కొనుగోళ్లపై విస్తృత ప్రచారం చేయాలని ఆదేశించారు. రైతులకు అవసరమైన గోనెసంచులు కొనుగోలు కేంద్రాల్లో అందుబాటులో ఉంచాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ సత్యనారాయణ కూడా పాల్గొన్నారు.

గ్యాస్ ధర పెంపుపై నిరసన



గ్యాస్ ధర పెంపుపై నిరసన తెలుపుతున్న సీపీఐ నాయకులు

కాకినాడ సిటీ: వంట గ్యాస్ ధరను కేంద్ర ప్రభుత్వం రూ.50 పెంచడాన్ని నిరసిస్తూ సీపీఐ జిల్లా సమితి ఆధ్వర్యాన కాకినాడలో గురువారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా కొత్త కాకినాడ నుంచి రామాలయం, డైరీ ఫామ్ రోడ్డు, ఏల్చూరి పాపారావు ఇంటి మీదుగా మదర్ థెరిస్సా బొమ్మ వరకూ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు తాటిపాక మధు మాట్లాడుతూ, అటు మోదీ, ఇటు కూటమి ప్రభుత్వాల దెబ్బకు ప్రజల జీవన విధానం కుదేలైందని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళలకు ఉచిత గ్యాస్ పేరుతో ఎన్నికల సమయంలో కూటమి నేతలు ఆర్భాటంగా ప్రచారం చేశారని గుర్తు చేశారు. తీరా ఎన్నికల్లో నెగ్గిన తర్వాత వంట గ్యాస్‌పై రూ.50 పెంచి ప్రజలపై భారం మోపడమేమిటని దుయ్యబట్టారు. ఇప్పటికే గడచిన 10 నెలల కాలంలో విద్యుత్ చార్జీలు, మందులు, పెట్రోల్, డీజిల్ ధరలు, ఆస్తి పన్ను, నిత్యావసర వస్తువుల ధరలను విపరీతంగా పెంచారని విమర్శించారు. గతంలో ప్రతిపక్షంలో ఉన్న బాదుడే బాదుడంటూ చంద్రబాబు ఆందోళనకు దిగారని, ఇప్పుడు ఆయన చేసినదేమిటని మధు ప్రశ్నించారు. సీపీఐ నాయకులు కె.బోడకొండ, తోకల ప్రసాద్ మాట్లాడుతూ, ఆస్తి విలువ ఆధారిత ఇంటి పన్ను విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు.



ఉప్పాడ పాత మార్కెట్ సమీపాన గాంధీ విగ్రహం వద్ద బెల్ట్ షాపు

మహాత్మా మన్నించు

ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ప్రాతినిధ్యం వహిస్తున్న పిఠాపురం నియోజకవర్గం ఉప్పాడ గ్రామంలో ఈ 'నిషా' సన్నివేశం నిత్యకృత్యం. ఇక్కడి పాత మార్కెట్ సమీపాన జాతిపిత మహాత్మాగాంధీ విగ్రహం సాక్షిగా కూటమి నేతల దన్నుతో బరితెగించి **మరీ ఇలా బెల్ట్ షాపు నడుపుతున్నారు.** అక్కడే మందుబాబులు తాగుతూ తూలుతున్నా పట్టించుకుంటున్న వారే లేరు. తీర ప్రాంత మండలమైన ఉప్పాడ కొత్తపల్లిలో ఎక్కడిపడితే అక్కడ మద్యం బెల్ట్ షాపులు నిర్వహిస్తున్నారు. ఈ బెల్ట్ షాపులతో రెక్కాడితేనే కానీ డొక్కాడని మత్స్యకారుల జీవితాలు గుల్లవుతున్నా ప్రజాప్రతినిధుల చెవికెక్కడం లేదు. కష్టజీవులు **రోజంతా రెక్కలు ముక్కలు చేసుకుంటూ సంపాది**స్తున్న రూ.700లో మందుకు రూ.300 పైనే ఖర్చయిపోతోంది. మండలంలోని ఉప్పాడ సహా పొన్నాడ, కోనపాపపేట, శీలంవారిపాలెం, కొత్తమూలపేట, మూలపేట, అమీనాబాద్, శ్రీరామపురం, రమణక్కపేట, కొమరగిరి, నాగులాపల్లి గ్రామాల్లో కిళ్లీ కొట్లే మద్యం బెల్ట్ షాపులుగా మారిపోయాయి. కిళ్లీ, సోడా అమ్మకాల కంటే మద్యం **అమ్మకాలతో రెండింతల లాభాలు ఆర్జిస్తున్నారు.**

విచ్చలవిడిగా..



కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గ్రామాల్లోని కిళ్లీ షాపులన్నీ బెల్ట్ షాపులుగా మారిపోయాయి. ముఖ్యంగా ప్రధాన కూడళ్లలోని షాపుల్లో రాత్రి, పగలు తేడా లేకుండా విచ్చలవిడిగా మద్యం విక్రయిస్తున్నారు. యువత మద్యానికి బానిసై అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారు. సంబంధిత అధికారులు తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. శివారు గ్రామాల్లో ఇళ్ల, గుడి, బడి సమీపాన మద్యం విక్రయిస్తున్నారు.

– కాజులూరి నేరెళ్ల రెడ్డి, రమణక్కపేట, కొత్తపల్లి మండలం



పెదబ్రహ్మదేవం గ్రామంలోని బెల్ట్ షాపు

కిళ్లీ కొట్లే బెల్ట్ షాపులు



సామర్లకోట మండలం జి.మేడపాడులోని మద్యం షాపునకు అనుబంధంగా పెదబ్రహ్మదేవం గ్రామంలో సుమారు 12 బెల్ట్ షాపులు నడుస్తున్నాయి. ప్రతి పాన్ షాప్‌లోనూ మద్యం విక్రయాలు యథేచ్ఛగా జరుగుతున్నాయి. ప్రతి కిళ్లీ కొట్టూ ఒక బెల్ట్ షాపుగా మారిపోతోంది. సాయంత్రం 6 నుంచి రాత్రి 10 గంటల వరకూ ఈ కిళ్లీ షాపుల్లో మద్యం అమ్మకాలు జోరుగా జరుగుతున్నాయి. ఒక్కో బెల్ట్ షాపులో రూ.50 వేలకు మించి అమ్మకాలు జరుగుతున్నాయన్నది అంచనా. దీనినిబట్టి వాటి ఆదాయం ఏవిధంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. బెల్ట్ షాపులు లేకుండా చేస్తామని ప్రకటనలు చేసిన చంద్రబాబు నాయుడు వీటిపై ఒక్కసారి దృష్టి సారించాలి.

– మలకల సూరిబాబు, ఎంపీటీసీ సభ్యుడు, పీబీ దేవం, సామర్లకోట మండలం

- బెల్ట్ షాపులు **నిర్మూలించామన్న** ఎక్సైజ్ మంత్రి
- జిల్లాలో ఎక్కడ **చూసినా అవే..**
- కిళ్లీ బడ్డీల్లో య**థేచ్ఛగా** మద్యం అమ్మ**కాలు**
- అధికారిక దు**కాణాలు 171**
- అంతకు మూడి**ంతల బెల్ట్ షాపులు**
- అధిక ధరలతో **ప్రతి నెలా** రూ.4.50 కో**ట్ల అక్రమార్జన**

బెల్ట్.. ఫుల్లు



సాక్షి ప్రతినిధి, కాకినాడ: 'రాష్ట్రంలో మద్యం బెల్ట్ షాపులు దాదాపు ని**ర్మూలించాం. రూ.99కే క్వార్టర్** బాటిల్ మద్యం అంది**స్తున్నాం. సారా రహిత రాష్ట్రం**గా ఏపీని మార్చేందు**కు చర్యలు తీసుకుంటున్నాం'** అని రాష్ట్ర ఎక్సైజ్ మం**త్రి కొల్లు రవీంద్ర గొప్పగా** చెప్పారు. తిరుపతిలోని పద్మావతీ మహిళా విశ్వవిద్యాలయంలో బుధవారం జరిగిన రాష్ట్ర స్థాయి సమావేశం అనంతరం మీడియా సమక్షంలో ఆయన్న మాటలివి. ఎక్సైజ్ అధికారుల సమక్షంలో మంత్రి చేసిన ఈ వ్యాఖ్యలు సర్వత్రా చర్చనీయాంశంగా మారాయి. వాస్తవానికి మంత్రి మాటలకు.. జిల్లాలోని పరిస్థితికి అసలు పొంతనే కనిపించడం లేదు. జిల్లాలోని ఏ మారుమూల గ్రామంలో అడుగు పెట్టినా రెండు మూడు బెల్ట్ షాపులు దర్శనమిస్తున్నాయి. కిళ్లీ కొట్లు, కిరాణా దుకాణాలు.. ఇలా నారా వారి పాలన ఊరూరా గుమ్మం ముంగిటకే మద్యాన్ని అందుబాటులోకి తెచ్చేసింది. మద్యపాన ప్రియులను మత్తులో చిత్తు చేస్తోంది. అయినప్పటికీ ఎక్సైజ్ అధికారులు చర్యలు తీసుకుంటున్న దాఖలాలు కానరావడం లేదు.

అసలు 171.. కొసరు 500

జిల్లావ్యాప్తంగా ప్రభుత్వం గుర్తించి, వేలం వేసిన మద్యం దుకాణాలు 171 ఉన్నాయి. ఇంతకు మూడింతలు పైబడి సుమారు 500 మద్యం బెల్ట్ షాపులు అనధికారికంగా నడుస్తున్నాయి. ఒక లైసె**న్స్‌డ్ మద్యం దుకాణం పరిధిలో మూడు పుల్లు, నాలుగు ఆఫ్ అనే రీతిలో మూడు నాలుగు బెల్ట్ షాపులు నిర్వహిస్తున్నారు. ఫలితంగా గ్రామాల్లో గడచిన ఆరేడు నెలలుగా అసాంఘిక కార్యకలాపాలు పెచ్చుమీరుతున్నాయి. యువత మద్యం** మత్తులో జోగుతూ పెడదోవ పడుతోందని తల్లిదండ్రులు ఆవేదన చెందుతున్నారు. జిల్లా కేంద్రం కాకినాడతో పాటు తీర మండలాలైన తొండంగి, ఉప్పాడ కొత్తపల్లి, కోటనందూరు, కాకినాడ రూరల్‌తో పాటు మెట్ట ప్రాంతంలో సైతం గ్రామగ్రామానా బెల్ట్ షాపులు జోరుగా నడుస్తున్నాయి.

ఎంఆర్‌పీకి మించి..

బెల్ట్ షాపుల్లో ప్రతి మద్యం బాటిల్‌పై ఎంఆర్‌పీని **మించి డబ్బులు గుంజుతున్నారు. బెల్ట్ షాపు నిర్వాహకులు ప్రతి రోజూ రెండు మూడు కేసుల మద్యాన్ని అధికారిక దుకాణంలో కొనుగోలు చేసి గ్రామాల్లో విక్రయిస్తున్నారు. బెల్ట్ షాపుల్లో బాటిల్‌పై అదనంగా రూ.40, రూ.50, రూ.60 వంతున** పెంచి విక్రయిస్తున్నారు. ఆ మేరకు నిరుపేదలను కూటమి నేతలు కొల్లగొడుతున్నారు. అధికారిక దుకాణాల్లో రోజుకు రెండు రూ.2 లక్షల నుంచి రూ.3 లక్షల మేర మద్యం అమ్మకాలు జరుగుతూండగా.. ఒక్కో బెల్ట్ షాపు ద్వారా కనీసం రూ.20 వేల మద్యం విక్రయిస్తున్నట్లు అంచనా. ప్రభుత్వం నుంచి అనుమతి పొందిన మద్యం దుకాణాల్లోనే ఎంఆర్‌పీకి మించి విక్రయిస్తున్నారు. పైకి మాత్రం **ప్రభుత్వ అనుమతితోనే ఎంఆర్‌పీ కంటే రూ.10** అదనం అంటూ బోర్డులు పెట్టారు.

రోజుకు రూ.కోటి

జిల్లావ్యాప్తంగా 500 బెల్ట్ షాపుల్లో రోజుకు సుమారు రూ.కోటి విలువైన మద్యం విక్రయాలు జరుగుతున్నట్లు అంచనా. అలాగే, అధిక ధరల దందాతో నేతల అక్రమార్జన సుమారు రూ.15 లక్షలుంటుందని చెబుతున్నారు. ఈవిధంగా నెలకు రూ.4.50 కోట్ల వరకూ కేవలం ధరల పెంపుతోనే కూటమి నేతలు అక్రమంగా ఆర్జిస్తున్నారు. పోలీసులు, ఎక్సైజ్ శాఖలకు 10 శాతం అంటే రూ.45 లక్షలు పోను మిగిలిన రూ.3.90 కోట్లు నియోజకవర్గాల్లోని కూటమి ముఖ్య నేతల జేబుల్లోకి పోతోందనే ఆరోపణలు వస్తున్నాయి. ఆ మేరకు మద్యం ప్రియుల జేబులు ఖాళీ అవుతున్నాయి. ప్రభుత్వానికి రూ.లక్షలు డిపాజిట్లు చేసి, వేలంలో షాపులు దక్కించుకున్న తమకంటే బెల్ట్ షాపుల నిర్వాహకుల అవతారమెత్తిన కూటమి నేతల పనే బాగుందని మద్యం వ్యాపారులు పేర్కొంటున్నారు.

కూటమి నేతల కనుసన్నల్లో..

- తుని నియోజకవర్గం తొండంగి, కోటనందూరు మండలాల్లో స్థానిక టీడీపీ నేతల కనుసన్నల్లో బెల్ట్ షాపులు నిర్వహిస్తూ, దండిగా అక్రమంగా ఆర్జిస్తున్నారు. ఆ పార్టీ ద్వితీయ శ్రేణి నేతల అనుచరులు ఈ బెల్ట్ షాపులు నడుపుతూండగా, నీకు సగం – నాకు సగం అంటూ పంపకాలు వేసుకున్నారు.
- ప్రత్తిపాడు నియోజకవర్గంలోని ఐటీడీఏ ఉప ప్రణాళికా ప్రాంతంలో ఉన్న రౌతులపూడి, శంఖవరం మండలాల్లోని ప్రతి గ్రామంలోనూ ఒక బెల్ట్ షాపును అక్కడి టీడీపీ ద్వితీయ శ్రేణి నేతలే నిర్వహిస్తున్నారు.
- జగ్గంపేట నియోజకవర్గం కిర్లంపూడి, గండేపల్లి మండలాల్లో సైతం టీడీపీకి చెందిన మండల స్థాయి ముఖ్య నేతల అనుచరులు బెల్ట్ షాపులు నడుపుతున్నారు.
- పెద్దాపురం నియోజకవర్గంలోని పెద్దాపురం, సామర్లకోట మండలాల్లో కూడా దాదాపు ఇవే పరిస్థితులు కనిపిస్తున్నాయి. సామర్లకోట మండలంలోని ఒక్క మాధవపట్నం గ్రామంలోనే 10కి పైనే బెల్ట్ షాపులున్నాయంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. బెల్ట్‌షాపులతో జీవనోపాధి కోల్పోతున్నామని ఇటీవల ఆ గ్రామంలోని కల్లుగీత కార్మిక కుటుంబాలు పెద్దాపురం ఎమ్మెల్యే, మాజీ హోం మంత్రి నిమ్మకాయల చినరాజప్ప ఇంటికి వెళ్లి మొర పెట్టుకోవడం గమనార్హం.
- స్మార్ట్ సిటీ కాకినాడలోని ఏటిమొగ, జగన్నాథపురం, సంజయ్ నగర్, రేచర్లపేట, సాంబమూర్తి నగర్‌లలో కిళ్లీ కొట్లలోనే బహిరంగంగానే బెల్ట్ షాపులు నడుపుతున్నారు.



ఏలేరు నీరు పంపాకు చేరేందుకు పోలవరం అధికారులు తవ్విన కాలువ నుంచి ప్రవహిస్తున్న వర్షపు నీరు



పోలవరం అక్విడెక్ట్ దిగువ నుంచి పంపాలోకి ప్రవహిస్తున్న వర్షపు నీరు

వరుణ కటాక్షం

- పంపా పరీవాహక ప్రాంతంలో వర్షాలు
- జలాశయానికి చేరుతున్న నీరు

అన్నవరం: అడుగంటిన నీటితో కళ తప్పిన **పంపా** జలాశయంపై వరుణుడు కటాక్ష వీక్షణాలు **ప్రసరి**స్తున్నాడు. పరీవాహక ప్రాంతాలైన రౌతులపూడి, శంఖవరం తదితర మండలాల్లోని కొండ ప్రాంతాల్లో మూడు రోజులుగా జోరుగా వర్షాలు కురిపిస్తున్నాడు. ఫలితంగా పంపా జలాశయానికి వాన నీరు తరలి వస్తోంది. ఫలితంగా పంపా రిజర్వాయర్ కాస్తంత జలకళను సంతరించుకుంటోంది.

గడచిన ఐదేళ్లలో ఎన్నడూ లేని విధంగా ఈ ఏడాది పంపా జలాశయం అడుగంటడంతో అన్నవరం దేవస్థానంతో పాటు, గ్రామంలో కూడా తీవ్ర నీటి ఎద్దడి నెలకొనే పరిస్థితులు ఏర్పడ్డాయి. దీనికి తోడు శ్రీరామ నవమి ఉత్సవాల్లో భాగంగా సీతారాములకు శనివారం, వార్షిక కల్యాణ మహోత్సవాల్లో భాగంగా సత్యదేవునికి వచ్చే నెల 12న పంపాలో చక్రస్నానం నిర్వహించాల్సి ఉంది. ఈ పరిస్థితుల్లో జలాశయం ఎండిపోవడంతో ఈ ఉత్సవాలకు నీటి సమస్య ఏర్పడే పరిస్థితి తలెత్తింది. ఈ నేపథ్యంలో ఏలేరు నుంచి పంపాకు నీటిని విడుదల చేయాలంటూ దేవస్థానం అధికారులు గత నెల 11న రాసిన లేఖకు కలెక్టర్ షణ్మోహన్ స్పందించారు. గత నెల 18న స్వయంగా అన్నవరం వచ్చి, పంపా నదిని, పోలవరం అక్విడెక్ట్‌ను పరిశీలించారు. పంపాకు ఏలేరు నీటిని తరలించడానికి పోలవరం అక్విడెక్ట్ పనులు ఆటంకంగా మారిందని గుర్తించారు. దీనిని అధిగమించడానికి అక్విడెక్ట్ ఎగువన రూ.22 లక్షలతో కాలువ నిర్మించి, ఆపై పైపులు వేసి పంపాకు నీరు తరలించాలని నిర్ణయించారు. ఈ పనులన్నీ ఈ నెల 15లోగా పూర్తి చేయాలని డెడ్‌లైన్ విధించారు.

పనులు పూర్తి కాకుండానే..

కలెక్టర్ ఆదేశాల మేరకు ఏలేరు నీటిని తరలించేందుకు వీలుగా అక్విడెక్ట్ పై భాగంలో పోలవరం అధికారులు కాలువ తవ్వారు. అలాగే, అక్విడెక్ట్ దిగువన వాహనాలు వెళ్లేందుకు వీలుగా వేసిన రోడ్డు అడుగున రెండు పైపులు ఏర్పాటు చేశారు. ఇంకో రెండు పైపులు ఏర్పాటు చేయాల్సి ఉంది. ఇంతలోనే పంపా ఎగువ ప్రాంతం నుంచి వర్షపు నీరు పెద్ద ఎత్తున పోలవరం అక్విడెక్ట్ వద్దకు చేరింది. అక్కడ మట్టితో అడ్డుకట్ట ఉండటంతో ఆ నీరు అక్కడ నిలిచిపోయింది. ఇది అక్విడెక్ట్ నిర్మాణ ప్రాంతంలోకి వచ్చే అవకాశం ఉండటంతో అధికారులు ఆ అడ్డుకట్టను తొలగించారు. దీంతో పాత కాలువతో పాటు పోలవరం అధికారులు తవ్విన కొత్త కాలువ నుంచి పంపా జలాశయంలోనికి వర్షపు నీరు వస్తోంది.

డెడ్ స్టోరేజీకి దిగువనే..

వర్షపు నీరు వస్తున్నప్పటికీ పంపా రిజర్వాయర్ నీటిమట్టం ఇంకా డెడ్ స్టోరేజీకి దిగువనే ఉంది. పంపా రిజర్వాయర్ గరిష్ట నీటిమట్టం 103 అడుగులు. ఆ స్థాయిలో 0.43 టీఎంసీల నీటిని నిల్వ చేయవచ్చు. డెడ్ స్టోరేజీ నీటిమట్టం 80 అడుగులు కాగా, ఆ స్థాయిలో 0.007 టీఎంసీల నీరు మాత్రమే నిల్వ ఉంటుంది. వర్షపు నీరు వచ్చి చేరుతూండటంతో పంపా నీటిమట్టం గురువారం 79 అడుగులకు చేరింది. నీటి నిల్వలు 0.005 టీఎంసీలకు చేరుకున్నాయి. ఇది డెడ్ స్టోరేజీ కన్నా ఒక అడుగు తక్కువ. జలాశయంలోనికి వర్షపు నీరు ఇంకా వస్తున్నందున మూడు, నాలుగు రోజుల్లో పంపా నీటిమట్టం స్వల్పంగా పెరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. దీంతో అందరూ ఊపిరి పీల్చుకుంటున్నారు.



పోలవరం అక్విడెక్ట్ వద్దకు చేరిన వాన నీరు

శ్రీరాముని చక్రస్నానానికి ఏర్పాట్లు

శ్రీరామ నవమి ఉత్సవాల్లో భాగంగా శనివారం ఉదయం పంపాలో నిర్వహించే శ్రీరాముని చక్రస్నాన మహోత్సవానికి పంపాలో ఏర్పాట్లు పూర్తి చేశారు. జలాశయంలోని పవర్ హౌస్ వద్ద కోనేరులా నిర్మించి, అందులోకి నదిలోని నీటిని మళ్లిస్తున్నారు. అక్కడే చక్రస్నానం నిర్వహిస్తారు.

15 నుంచి పంపాకు ఏలేరు నీరు



వర్షపు నీరు వస్తున్నప్పటికీ కనీసం నాలుగు రోజుల వరకూ పంపా రిజర్వాయర్ నీటిమట్టంలో ఎటువంటి మార్పూ ఉండదు. ఇప్పుడు కురుస్తున్న వర్షాలతో పెద్దగా ప్రయోజనం ఉండదు. గట్టిగా ఎండలు కాస్తే ఆ నీరు కాస్తా మళ్లీ ఆవిరైపోతుంది. భారీ వర్షాలు కురిసి, పంపా నీటి మట్టం కనీసం 90 అడుగులకు చేరితే తప్ప సమస్య పరిష్కారం కాదు. అందువలన కలెక్టర్ షణ్మోహన్ ఆదేశాల మేరకు ఈ నెల 15 నుంచి పంపాకు ఏలేరు నీటిని విడుదల చేయిస్తాం.

– జి.శేషగిరిరావు, ఈఈ, ఇరిగేషన్

తాగునీటి చౌర్యంపై చర్యలు

- కుళాయిలకు అక్రమ మోటార్లు బిగిస్తే పైపులైన్లు కట్
- అధికారులకు కలెక్టర్ ఆదేశం

కాకినాడ సిటీ: తాగునీటి కుళాయిలకు అక్రమంగా మోటార్లు బిగించి, కృత్రిమంగా నీటి కొరత సృష్టిస్తున్న వారి ఇళ్ల పైపులైన్లను కట్ చేయాలని, **తద్వారా శివా**రు ప్రాంతాల ప్రజలకు నీటి ఎద్దడి **నివారించాలని** జిల్లా కలెక్టర్ షణ్మోహన్ సగిలి ఎం**పీడీఓలను** ఆదేశించారు. ఎంపీడీఓలు, డ్వామా **ఏపీఓలతో** కలెక్టరేట్‌లో గురువారం నిర్వహించిన **సమావేశంలో** మాట్లాడారు. వేసవిలో ప్రజలకు **తాగునీటి ఎద్ద**డి ఎదురు కాకుండా జిల్లాలోని ప్రతి **ఆవాసంలో క**నీసం ఒక తాగునీటి వనరును అందు**బాటులో ఉం**చాలని ఆదేశించారు. అక్విడెక్ట్ నిర్మాణ **పనుల కారణ**ంగా పంపా రిజర్వాయర్‌కు ఏలేరు **నీరు విడుదల** చేయడం లేదని తెలిపారు. ఈ **నేపథ్యంలో** అన్నవరం దేవస్థానం, గ్రామానికి ప్రత్యామ్నాయ నీటి సరఫరా ఏర్పాట్లను సత్వరమే పూర్తి చేయాలని ఆదేశించారు.

ఉత్తమ అధికారులకు ప్రశంసలు

ఉపాధి హామీ పథకం లక్ష్య సాధనలో ఉత్తమ కృషి చేసిన ఎంపీడీఓలను, ఏపీఓలను కలెక్టర్ షణ్మోహన్ అభినందించి, జ్ఞాపికలు అందజేశారు. అన్ని సూచికల సాధనలో జిల్లాలోనే పిఠాపురం మొదటి స్థానంలో నిలిచిందన్నారు. రెండో స్థానంలో గండేపల్లి, మూడో స్థానంలో కాకినాడ రూరల్, నాలుగో స్థానంలో ఏలేశ్వరం మండలాలు నిలిచాయని వివరించారు. జిల్లాలో గడచిన ఆర్థిక సంవత్సరంలో ఉపాధి హామీ పథకం ద్వారా 78 లక్షల పని దినాలు కల్పించాలన్నది లక్ష్యం కాగా, 75 లక్షల పని దినాలు కల్పించి, 96 శాతం లక్ష్యాన్ని సాధించామని తెలిపారు. అంతకు ముందు సంవత్సరం కంటే అదనంగా 6 లక్షల పని దినాలు కల్పించారన్నారు. ఇదే స్ఫూర్తితో ఈ ఏడాది మరింత మెరుగైన ఫలితాలు సాధించాలని కోరారు. పని దినాల కల్పనలో ఏలేశ్వరం, గండేపల్లి, కిర్లంపూడి, జగ్గంపేట, యు.కొత్తపల్లి మండలాలు ముందు నిలిచాయన్నారు. తుని, కరప, కోటనందూరు, పెదపూడి మండలాలు లక్ష్య సాధనకు మరింత కృషి చేయాలని సూచించారు. ఉపాధి హామీ పథకం సమన్వయంతో రూ.76.62 కోట్లతో 146.57 కిలోమీటర్ల సీసీ, బీటీ రోడ్లు అభివృద్ధి చేశామన్నారు. పశువులు, మేకలు, గొర్రెలు, పౌల్ట్రీలకు రూ.20.90 కోట్లతో 1,045 షెడ్లు నిర్మించామని చెప్పారు. 769 ఎకరాల్లో పండ్ల తోటల పెంపకం, 27 సంస్థల్లో మొక్కలు నాటడం, 76 ఫార్మ్‌పాండ్స్ నిర్మాణ పనులు నిర్వహించామని తెలిపారు. రానున్న మూడు నెలల్లో ఉపాధి పనులు మరింత ముమ్మరంగా చేపట్టాలని అధికారులను ఆదేశించారు. పశువుల దాహార్తి తీర్చేందుకు 461 నీటి తొట్టెలు నిర్మించాలన్నది లక్ష్యం కాగా, ఇప్పటి వరకూ 246 పనులు మంజూరుచేసి 78 పనులు పూర్తి చేశారని తెలిపారు. మిగిలిన నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేయాలని కోరారు. ఆరేళ్ల లోపు చిన్నారుల ఆధార్ నమోదుకు పోస్టాఫీసు, సీఎస్సీ, సచివాలయాల్లో ప్రత్యేక క్యాంపులు నిర్వహిస్తామని, దీనికి సంబంధించిన షెడ్యూల్ తెలియజేస్తామని కలెక్టర్ వివరించారు. సమావేశంలో డ్వామా పీడీ ఎ.వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



ఉత్తమ ఫలితాలు సాధించిన ఎంపీడీఓలు, ఏపీఓలకు జ్ఞాపికలు అందజేస్తున్న కలెక్టర్ షణ్మోహన్

నేడు లోవ రాజగోపురం మెట్లోత్సవం

తుని రూరల్: తలుపులమ్మ అమ్మవారి లోవ దేవస్థానంలో నూతనంగా నిర్మించిన రాజగోపురం మెట్లోత్సవానికి అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. శుక్రవారం పసుపు, కుంకుమతో మెట్ల పూజ నిర్వహిస్తున్నామని దేవస్థానం కార్యనిర్వహణాధికారి పెన్మెత్స విశ్వనాథరాజు గురువారం తెలిపారు. లోవ కొత్తూరు గ్రామంలో ఉన్న అమ్మవారి ఉపాలయం వద్ద నిర్మించిన ముఖ మండపం ప్రారంభోత్సవ కార్యక్రమాల్లో ప్రభుత్వ విప్ యనమల దివ్య పాల్గొంటారన్నారు. దేవస్థానం ఆధ్వర్యాన లోవకొత్తూరులో ఈ నెల 12 నుంచి అమ్మవారి గంధామావాస్య జాతర ప్రారంభమవుతున్నట్లు తెలిపారు.

క్లుప్తంగా

రైలు నుంచి జారి పడి వ్యక్తి మృతి


రైలు పట్టాల వద్ద పడి ఉన్న మృతదేహం

రాజమహేంద్రవరం సిటీ: అదుపుతప్పి రైలు నుంచి జారి పడి ఓ వ్యక్తి మృతిచెందినట్టు రాజమహేంద్రవరం జీఆర్పీ ఎస్సై మావుళ్లు గురువారం తెలిపారు. ద్వారపూడి–కడియం రైల్వేస్టేషన్ల మధ్య సుమారు 45 ఏళ్ల గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని గుర్తించినట్టు చెప్పారు. మృతదేహాన్ని స్థానిక ప్రభుత్వాస్పత్రి మార్చురీలో భద్రపర్చినట్టు తెలిపారు. మృతుడు నీలం రంగు ప్యాంటు, పసుపు రంగు టీ షర్ట్ ధరించి ఉన్నాడని చెప్పారు. టాటానగర్ నుంచి పాలక్కడ్‌కు జనరల్ టికెట్ ఉందన్నారు. వివరాలు తెలిస్తే 94406 27551, 94910 03239 నంబర్లలో సమాచారం ఇవ్వాలని కోరారు.

వడదెబ్బకు వ్యక్తి మృతి


లక్ష్మణరావు (ఫైల్)

పిఠాపురం: గొల్లప్రోలు మండలం ఏకే మల్లవరానికి చెందిన నాయీ బ్రాహ్మణుడు సంధిపర్తి లక్ష్మణరావు(50) గురువారం వడ దెబ్బకు గురై మృతి చెందినట్టు కుటుంబ సభ్యులు గొల్లప్రోలు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. గ్రామంలోని దుర్గాదేవి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో బాజాభజంత్రీలు వాయిస్తుండగా, లక్ష్మణరావు ఆకస్మికంగా కుప్పకూలాడు. స్థానికులు అతడిని పిఠాపురం ప్రభుత్వాస్పత్రికి తరలించగా, అప్పటికే మరణించినట్టు వైద్యులు ధ్రువీకరించారు. ఈయనకు భార్య, ముగ్గురు కుమార్తెలున్నారు.

పోక్సో కేసులో వ్యక్తి అరెస్టు

ప్రత్తిపాడు: పెళ్లి చేసుకుంటానని నమ్మించి యువతిని వంచించిన వ్యక్తిపై పోక్సో కేసు నమోదు చేసి పెద్దాపురం డీఎస్పీ శ్రీహరిరాజు గురువారం అరెస్టు చేశారు. ప్రత్తిపాడు మండలం ఒమ్మంగి గ్రామానికి చెందిన వి.గన్నిబాబు అదే మండలంలోని మరో గ్రామానికి చెందిన యువతిని ప్రేమించానని నమ్మించాడు. పెళ్లి చేసుకుంటానని చెప్పి మోసం చేయడంతో ఆమె ఇటీవల పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ క్రమంలో అతడిని అరెస్టు చేసినట్టు పోలీసులు తెలిపారు.

16లోగా అభ్యంతరాలు, గ్రీవెన్స్ సమర్పించాలి

అమలాపురం రూరల్: ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని డైరెక్టరేట్ ఆఫ్ సెకండరీ హెల్త్, పూర్వ వైద్య విధాన పరిషత్ ఆస్పత్రుల్లో ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీకి కాంట్రాక్ట్ అవుట్ సోర్సింగ్ ప్రాతిపదికన పనిచేసేందుకు గత నెలలో అభ్యర్థుల నుంచి దరఖాస్తులను స్వీకరించినట్టు ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా వైద్య సేవల సమన్వయాధికారి ఎం.పద్మ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు దరఖాస్తుల పరిశీలన అనంతరం htpp://artgodavari.nic.in వెబ్‌సైట్‌లో ప్రావిజనల్ లిస్ట్ పొందుపర్చినట్టు చెప్పారు. ఈ జాబితాలో అభ్యంతరాలు ఉంటే ఈ నెల 11 నుంచి 16వ తేదీ సాయంత్రం ఐదు గంటల్లోగా కొవ్వూరు ఆస్పత్రి ఆవరణలోని జిల్లా వైద్య సేవల సమన్వయాధికారి కార్యాలయంలో తగిన ఆధారాలతో సమర్పించాలని కోరారు. అభ్యంతరాలు, గ్రీవెన్స్ పరిశీలన తర్వాత ఫైనల్ మెరిట్ లిస్ట్ వెబ్‌సైట్‌లో ఉంచుతామని తెలిపారు.

అశ్వ రాజసం

- పదేళ్ల తర్వాత.. గుర్రపు పందాలు
- చేబ్రోలులో నేటి మధ్యాహ్నం ప్రారంభం
- వివిధ ప్రాంతాల నుంచి తీసుకొచ్చిన పెంపకందారులు
- ఆదరణ తగ్గిందని ఆవేదన

పిఠాపురం: పౌరాణిక చిత్రాల్లో ఎన్టీఆర్, ఏఎన్నార్, కత్తి కాంతారావు లాంటి మహా నటులు మొదలు.. ఆ తర్వాత వచ్చిన చిత్రాలు 'కొండవీటి దొంగ'లో చిరంజీవి, 'టక్కరి దొంగ'లో మహేష్‌బాబు, 'మగధీర'లో రాంచరణ్, 'బాహుబలి'లో ప్రభాస్, తాజాగా 'డాకు మహరాజ్'లో బాలకృష్ణ వంటి హీరోలు గుర్రపు స్వారీ చేస్తుంటే.. చూసే అభిమానులకు రెండు కళ్లూ చాలవు. హీరోలు, పెహల్వాన్లే కాదు, గుర్రాలను మేమూ దౌడు తీయిస్తామంటున్నారు హార్స్ రైడర్లు. ఇటీవల కాలంలో గుర్రపు స్వారీలు బాగా పెరిగాయి. గుర్రపు స్వారీలో శిక్షణ ఇచ్చే కేంద్రాలూ వెలిశాయి. వీటికంటే పందాల్లో పాల్గొనే గుర్రాల పెంపకం చాలా కాలం నుంచీ ఉంది. గతంలో ప్రాంతలకతీతంగా గుర్రపు పందాలు జరుగుతుండేవి. ఈమధ్య కాలంలో గుర్రపు పందాలు చాలా వరకూ తగ్గిపోయాయి. అధిక ఖర్చుతో కూడుకున్న పందాలు కావడంతో.. వీటిని నిర్వహించడానికి ఎవరూ ముందుకు రావడం లేదు. జిల్లాలో పదేళ్ల తర్వాత గొల్లప్రోలు మండలం చేబ్రోలులో గుర్రపు పందాల నిర్వహణకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. రాష్ట్రం నలుమూలల నుంచి పందెపు గుర్రాలు చేబ్రోలుకు చేరాయి. మూడు రోజులుగా వీటిని ఇక్కడకు చేర్చిన యజమానులు.. పందెం బరిలో వాటికి ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు. శుక్రవారం మధ్యాహ్నం రెండు గంటలకు ప్రారంభమయ్యే ఈ పోటీలకు ఇప్పటికే రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి 20 గుర్రాల వరకు చేరాయి. పోటీల సమయానికి మరో పది గుర్రాలు రావచ్చని నిర్వాహకులు చెబుతున్నారు.


ఇలా మసాజ్ చేయకపోతే పరుగు ఇబ్బందే..

నటన కాదు.. పరుగులెత్తించాలి

సాధారణంగా సినిమాల్లో హీరోలు చేసే హార్స్ రైడింగ్ చాలా సున్నితంగా ఉంటుంది. ఎడిటింగ్‌లో వేగంగా వెళ్లినట్టు చూపిస్తుంటారు. పందాల్లో అలా కాదు. గుర్రాల సామర్థ్యాన్ని నిరూపించుకోవాల్సి ఉంటుంది. అందుకే పందాల్లో పాల్గొనే గుర్రాలకు ప్రత్యేక మేతతో పాటు, శిక్షణ ఉంటుంది. వేగానికి చిహ్నంగా నిలిచే గుర్రం పూర్వం నుంచి తన ఉనికిని చాటుకుంటోంది. సాధారణ గుర్రాలు రూ.50 వేల నుంచి రూ.రెండు లక్షల వరకు విలువ ఉండగా, మేలు జాతి గుర్రాలైతే రూ.10 లక్షల నుంచి రూ.కోటికి పైగా ఖరీదైనవి ఉన్నాయి. మేలు జాతి గుర్రాలకు గిరాకీ ఎక్కువ. వాటిని కొనడం ఓ ఎత్తయితే.. పోషించడం మరో ఎత్తు. ఒక్కో గుర్రం పెంపకానికి నెలకు సుమారు రూ.15 వేల నుంచి రూ.20 వేల వరకు ఖర్చవుతుందని పెంపకందారులు చెబుతున్నారు.


చేబ్రోలు చేరుకుంటున్న గుర్రాలు


చేబ్రోలు గుర్రపు పందాల్లో ఆకర్షణగా నిలిచిన డాకు మహారాజ్ సినిమాలోని గుర్రం (అసలు పేరు రేకట్. ప్రస్తుతం డాకు మహరాజ్)

ప్రాచీన కళకు జీవం పోయాలని..



"కొన్నేళ్లుగా గుర్రపు పందాల నిర్వహణకు సమన్వయం చేస్తుంటాను. అందుకే నాకు గుర్రాల చిన్న అనే పేరు వచ్చింది. గుర్రపు పందాలు ఎంతో ప్రాచీనమైనవి. రాను రాను వీటి ఉనికి దెబ్బతింటోంది. గుర్రపు పందాలు వినోదమే కాదు, వీటి వల్ల అనేక మూగ జీవాలైన గుర్రాలు సంరక్షించబడతాయి. అందుకే పందాలు గుర్రాల ఉనికిని చాటుతున్నాయి. రాష్ట్రంలో విజయనగరం, విశాఖపట్నం, కాకినాడ, విజయవాడ తదితర ప్రాంతాల్లో గుర్రాల పెంపకం పెరిగింది. ఎక్కడ పందాలు జరిగినా అందరూ తమ గుర్రాలను తీసుకొస్తుంటారు. ఇది చాలా ఖర్చుతో కూడుకున్న క్రీడ. నిర్వాహకులు, గుర్రాల పెంపకందారులు ఖర్చుకు వెనుకాడరు. పందాల్లో పాల్గొనే గుర్రాలకు చేసే సపర్యలు అంతాఇంతా కాదు. వీటికి ప్రత్యేక ఖరీదైన దాణాతో పాటు, మసాజ్‌లు చేయాలి. గెలిస్తే వచ్చేది పేరు తప్ప ఏమీ ఉండదు. కానీ ఆ గెలుపు కోసం నెలల తరబడి గుర్రాలను రూ.లక్షలు ఖర్చు పెట్టి పోషిస్తుంటారు. ఎప్పుడో ఓసారి పందాలకు వెళ్లి గుర్రం అలిసిపోతుంది మినహా, రోజూ వాటిని పోషించడానికి రైతు ప్రతి రోజూ అలిసిపోతాడు. గుర్రపు స్వారీ చేయడం వల్ల వచ్చే ఆరోగ్యం చాలా ఎక్కువ. దానికోసం ఇప్పుడు గుర్రపు స్వారీ శిక్షణా కేంద్రాలు వెలిశాయి. చాలా ఏళ్ల తర్వాత గుర్రపు పందాలు జరగడం ఆనందంగా ఉంది."

– గుర్రాల చిన్న, పెద్దాపురం

గంటలో బాలిక ఆచూకీ లభ్యం

తల్లిదండ్రులకు అప్పగించిన పోలీసులు


కుతుకులూరులో బాలికను తల్లిదండ్రులకు అప్పగిస్తున్న ఎస్సై శ్రీనునాయక్

పెదపూడి: అనపర్తి మండలం కుతుకులూరు గ్రామంలో నాలుగో తరగతి విద్యార్థిని అదృశ్యం సంఘటన కలకలం రేపగా, గంట వ్యవధిలో పోలీసులు ఆ బాలికను పట్టుకుని తల్లిదండ్రులకు అప్పగించారు. అనపర్తి ఎస్సై శ్రీనునాయక్ తెలిపిన వివరాల మేరకు, కుతుకులూరు గ్రామంలో లంక సత్యనారాయణ కుమార్తె షర్మిల రామవరం ఎంపీపీ స్కూల్‌లో నాలుగో తరగతి చదువుతోంది. గురువారం ఉదయం టిఫిన్ తెచ్చుకోడానికి ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఆమె తిరిగి రాలేదు. దీంతో ఆందోళన చెందిన తల్లిదండ్రులు చుట్టుపక్కల వెతికినా బాలిక ఆచూకీ లభ్యం కాలేదు. దీంతో వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐ సుమంత్ సూచనలతో రంగంలోకి దిగిన అనపర్తి ఎస్సై శ్రీనునాయక్, అదనపు ఎస్సై దుర్గాప్రసాద్ తమ సిబ్బంది బాలిక కోసం గాలింపు చేపట్టారు. గంట వ్యవధిలోనే కుతుకులూరు గ్రామంలో ఓ చోట బాలికను పోలీసులు కనుగొన్నారు. ఈ సంఘటనపై బాలికను పోలీసులు వివరాలు అడగ్గా, బాగా చదవడం లేదని తల్లిదండ్రులు మందలించినందుకు వెళ్లిపోయినట్టు చెప్పిందని ఎస్సై తెలిపారు. వెంటనే స్పందించి, బాలిక ఆచూకీని కనుగొన్న పోలీసులను తల్లిదండ్రులు, గ్రామస్తులు అభినందించారు.

మహిళపై టీడీపీ మాజీ కౌన్సిలర్ దాడి


రక్షణ కల్పించాలని డీఎస్పీకి బాధితురాలి ఫిర్యాదు


డీఎస్పీ ప్రసాద్‌కు ఫిర్యాదు చేస్తున్న వెంకటలక్ష్మి

అమలాపురం టౌన్: తమ ఇంట్లో అద్దెకుంటున్న వ్యక్తిపై గొడవకు వచ్చిన అమలాపురానికి చెందిన టీడీపీ మాజీ కౌన్సిలర్ దున్నాల దుర్గ, అతని అనుచరులు తనపై ఇనుప రాడ్లతో దాడి చేసి, గాయపరిచారని స్థానిక నల్లవంతెన రజకపేటకు చెందిన టీకి వెంకటలక్ష్మి డీఎస్పీ టీఎస్ఆర్‌కే ప్రసాద్‌కు ఫిర్యాదు చేశారు. స్థానిక డీఎస్పీ కార్యాలయంలో గురువారం దీనిపై ఆమె ఫిర్యాదు చేయడమే కాకుండా, తనకు దున్నాల దుర్గ నుంచి రక్షణ కల్పించాలని డీఎస్పీని కోరారు. ఈ నెల 3న రాత్రి పది గంటల ప్రాంతంలో తన ఇంట్లో అద్దెకుంటున్న తోలేటి ఓంప్రకాష్ ఎక్కడ అంటూ తనపై దాడి చేశారని ఆమె ఫిర్యాదులో పేర్కొన్నారు. వారిపై ఫిర్యాదు చేసినా ఎవరూ పట్టించుకోలేదని, రాజకీయ పలుకుబడితో మాజీ కౌన్సిలర్‌ను తప్పించే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆమె వివరించారు. తనపై దాడి చేసిన దున్నాల దుర్గతో పాటు, దున్నాల దిలీప్, కంచిపల్లి శ్రీను, జక్కపు ప్రసాద్, ఏలూరి అయ్యప్పపై కేసు నమోదు చేయాలని ఫిర్యాదులో కోరారు. ఆమెకు సంఘీభావాన్ని తెలిపిన వీసీకే పార్టీ రాష్ట్ర కార్యదర్శి బొంతు రమణతో కలిసి బాధితురాలు డీఎస్పీ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు.

జీడి పప్పు పరిశ్రమలకు హై ఓల్టేజీ

- మాడిపోయిన సరకు
- కాలిపోయిన పరికరాలు


హైఓల్టేజీకి మోరిపోడులో మాడిపోయిన జీడి పప్పు


దెబ్బతిన్న డ్రయ్యర్ మెషీన్

మలికిపురం/సఖినేటిపల్లి: హైఓల్టేజీ కారణంగా సఖినేటిపల్లి మండలం మోరిపోడులో బుధవారం రాత్రి పలు జీడిపప్పు పరిశ్రమలకు నష్టం వాటిల్లింది. దీని ప్రభావంతో విలువైన జీడిపప్పు మాడిపోయింది. అలాగే విలువైన విద్యుత్ పరికరాలు, జీడిపప్పు డ్రయ్యర్ మెషీన్లు దెబ్బతిన్నాయి. గ్రామంలోని ముప్పర్తి సుబ్బారావు పరిశ్రమతో పాటు, మరికొన్ని పరిశ్రమల్లో భారీ నష్టం వాటిల్లినట్టు చెబుతున్నారు. జీడి పప్పు ప్రాసెసింగ్ కోసం డ్రయ్యర్ మెషీన్లలో ఉంచగా, తెల్లవారుజామున అటుగా జీడి పప్పు డ్రమ్ముల వద్దకు వెళ్లిన కార్మికులు హైఓల్టేజీని గమనించడంతో పెను ప్రమాదం తప్పింది. వెంటనే కార్మికులు మెయిన్ స్విచాఫ్ చేసి విద్యుత్ సరఫరాను నిలిపివేశారు. లేకపోతే మరింత నష్టం వాటిల్లేదని సుబ్బారావు తెలిపారు. సుమారు రూ.10 లక్షల ఆస్తి నష్టం వాటిల్లి ఉంటుందని వ్యాపార వర్గాలు తెలిపాయి. రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ గురువారం దెబ్బతిన్న పరిశ్రమలను పరిశీలించారు. హైఓల్టేజీకి కారణాలను అధికారుల నుంచి అడిగి తెలుసుకున్నారు.

రెండో శనివారమూ 'పని'వారమేనా..!

కాకినాడ లీగల్: స్టాంపులు, రిజిస్ట్రేషన్ శాఖలో సెలవు దినాల్లో ఉద్యోగులతో పనులు చేయిస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. రెండో శనివారం సెలవు అయినప్పటికీ, విధులకు రావాలని స్టాంపులు, రిజిస్ట్రేషన్ శాఖ రాష్ట్ర ఉన్నతాధికారి నుంచి వాట్సాప్ గ్రూపు మెసేజ్ రావడంతో ఉద్యోగులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఈ నెల 12, 13, 14 తేదీల్లో వరుసగా మూడు రోజుల పాటు సెలవులు ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఉద్యోగులు కుటుంబ సమేతంగా ప్రయాణాలు, ఇతర కార్యక్రమాలకు ఏర్పాట్లు చేసుకున్నారు. ఇలాఉండగా బుధవారం రిజిస్ట్రేషన్ శాఖలోని ఓ ఉన్నతాధికారి ఆ శాఖ వాట్సాప్ గ్రూప్‌లో ఉద్యోగులు, సిబ్బంది అందరూ 12వ తేదీ విధులకు రావాల్సి ఉంటుందని మెసేజ్ చేశారు. దీంతో కంగుతిన్న ఉద్యోగులు.. సెలవుల నేపథ్యంలో తాము నిర్ణయించుకున్న ప్రయాణాలు నిలిపివేయాల్సి వస్తుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై ఇప్పటివరకు ఎటువంటి అధికారిక ప్రకటన జారీ కాలేదు. కాగా గత నెల 30న ఉగాది, 31న రంజాన్ పండగ దినాల్లో కూడా రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో ఉద్యోగులు పని చేశారు. ఆర్థిక సంవత్సరం ముగింపు కాబట్టి కార్యకలాపాలు జరిపారని, ఏప్రిల్ 12న కూడా పనిచేయాలంటూ ఉన్నతాధికారులు ఆదేశించడంపై ఉద్యోగులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

పండ్ల వ్యాపారి తండ్రి కిడ్నాప్


సుబ్బారావు కుమారుడు శ్రీరామ్ రమేష్


కిడ్నాప్ గురైన మురళీహర సుబ్బారావు (ఫైల్)

రావులపాలెం: ఆర్థిక లావాదేవీల కోసం పండ్ల వ్యాపారంలో తమతో భాగస్వామి అయిన వ్యక్తి తన తండ్రిని కిడ్నాప్ చేశాడని రావులపాలేనికి చెందిన శిరగం శ్రీరామ్ రమేష్ స్థానిక పోలీసులకు గురువారం ఫిర్యాదు చేశాడు. వివరాలివీ.. రావులపాలెంలో ఓ లాడ్జి, జ్యూస్ సెంటర్ నిర్వాహకుడైన శిరగం శ్రీరామ్ రమేష్ నాలుగేళ్లుగా మహారాష్ట్ర జిల్లా సాంగ్లీ ప్రాంతానికి చెందిన సంజుతో కలిసి పండ్ల తోటల వ్యాపారం చేస్తున్నాడు. సంజు మహారాష్ట్రలో పండ్ల తోటలు కొని పెడుతూ, మధ్యవర్తిత్వం చేస్తుంటాడు. ఈ క్రమంలో రమేష్ తండ్రి శిరగం మురళీహర సుబ్బారావు ద్రాక్ష తోటల కొనుగోలు కోసం తరచూ మహారాష్ట్ర వెళ్లి వస్తున్నాడు. ఇటీవల ఓ లోడుకు సంబంధించి రూ.15 లక్షలు బాకీ పడడంతో రమేష్, సంజు మధ్య వివాదం తలెత్తింది. ఈ నేపథ్యంలో సంజు మనుషులు రావులపాలెం వచ్చి మూడు రోజులుగా రెక్కీ నిర్వహించారు. బుధవారం రాత్రి ఇంటికి వెళ్తున్న సుబ్బారావును స్థానిక ఆదిలక్ష్మీ నగర్ ఐదో వీధిలోని వారి ఇంటి సమీపంలో కారు ఎక్కించుకుని, మహారాష్ట్ర తీసుకెళ్లారు. తండ్రి ఇంటికి రాకపోవడంతో వెతుక్కుంటూ వెళ్లిన రమేష్‌కు తండ్రి స్కూటీ, చెప్పులు ఇంటి సమీపంలోని వీధిలో కనిపించాయి. సీసీ కెమెరాల ఫుటేజ్ ఆధారంగా గాలించగా, అర్ధరాత్రి ఇంటికి వస్తున్న తన తండ్రిని నలుగురు వ్యక్తులు కారులో ఎక్కించుకుని తీసుకువెళ్లినట్లు గుర్తించి, పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సంజు మనుషులు తనను మహారాష్ట్ర తీసుకు వెళుతున్నట్లు తండ్రి సుబ్బారావు గురువారం ఉదయం ఫోనులో చెప్పాడని పోలీసులకు శ్రీరామ్ రమేష్ తెలిపాడు. తన వద్ద గతంలో పని చేసి మానేసిన గంటి గ్రామానికి చెందిన రుద్ర సురేష్ కిడ్నాపర్లకు సహకరించాడని, మూడు రోజులుగా రావులపాలెంలో వారిని తిప్పాడని ఆరోపిస్తూ అతడిని పోలీసులకు అప్పగించాడు. కారులో నలుగురు రాగా వారిలో సంజయ్, రమేష్, గోపయ్య, మరో వ్యక్తి ఉన్నారని పోలీసు విచారణలో రుద్ర సురేష్ చెప్పాడు. తన తండ్రి సుబ్బారావు ఇంటికి ఫోను చేసి, 'మీరు మహారాష్ట్ర వస్తున్నారా?' అని అడుగుతున్నాడని శ్రీరామ్ రమేష్ పోలీసులకు తెలిపాడు. రమేష్ ఫిర్యాదు మేరకు ఆరుగురు నిందితులపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని రావులపాలెం అదనపు ఎస్సై కేవీ రమణారెడ్డి తెలిపారు.

ట్రాక్టర్ బోల్తా.. వ్యక్తి మృతి


తిరగబడిన ట్రాక్టర్‌ను తీస్తున్న పొక్లెయిన్


సిద్ధ వెంకటేశ్వరరావు (ఫైల్)

సీతానగరం: ఇటుక బట్టీలో మట్టిని తొక్కుతున్న ట్రాక్టర్ అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ఘటనలో మండలంలోని రఘుదేవపురానికి చెందిన సిద్ధ వెంకటేశ్వరరావు(45) మృతిచెందాడు. పోలీసుల వివరాల మేరకు, ఎప్పటిలాగే గురువారం ఉదయం వెంకటేశ్వరరావు స్థానిక రవీంద్ర కాలనీలోని తన ఇటుక బట్టీ వద్దకు వెళ్లాడు. ఇటుకల తయారీ కోసం మట్టిని ట్రాక్టర్‌తో తొక్కుతుండగా, అదుపుతప్పి ట్రాక్టర్ బోల్తా పడింది. ఈ క్రమంలో వెంకటేశ్వరరావు అదే మట్టిలో కూరుకుపోయాడు. బట్టీ వద్ద ఉన్నవారు పొక్లెయిన్ సాయంతో ట్రాక్టర్‌ను తొలగించి, వెంకటేశ్వరరావును బయటకు తీశారు. అపస్మారక స్థితిలో ఉన్న అతడిని స్థానిక బస్టాండ్ సెంటర్ వద్దనున్న ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మృతి చెందాడు. అతడి మృతితో భార్య దుర్గాభవాని, తల్లి సత్యవతి, వివాహితలైన కుమార్తెలు కోటేశ్వరి, సంధ్యారాణి భోరున విలపించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం రాజమహేంద్రవరం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసినట్టు హెడ్ కానిస్టేబుల్ శ్రీను తెలిపారు.

24 వేసవి ప్రత్యేక రైళ్లు



రాజమహేంద్రవరం సిటీ: వేసవి ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని తూర్పుగోదావరి జిల్లా మీదుగా ఈ నెల 11 నుంచి జూన్ 28వ తేదీ వరకు ప్రతి శుక్ర, శనివారాల్లో ప్రత్యేక రైళ్లు నడిపేందుకు చర్యలు చేపట్టినట్టు రైల్వే అధికారులు గురువారం ప్రకటించారు. చర్లపల్లి–శ్రీకాకుళం రోడ్డు(07025) రైలు ప్రతి శుక్రవారం, శ్రీకాకుళం రోడ్డు–చర్లపల్లి(07026) ప్రతి శనివారం అందుబాటులో ఉంటుందన్నారు. ఈ రైళ్లు జిల్లాలోని రాజమహేంద్రవరం, సామర్లకోట, అన్నవరం, తుని రైల్వే స్టేషన్లలో ఆగుతాయని చెప్పారు. అలాగే తిరుపతి–షిరిడీ సాయి నగర్ మధ్య నడిచే ప్రత్యేక రైళ్ల(07637/38)ను జూన్ 30వ తేదీ వరకు పొడిగించినట్టు తెలిపారు.

ఎదురెదురుగా ఢీకొన్న లారీ, వ్యాన్

ఇద్దరు డ్రైవర్లకు గాయాలు


ప్రమాదంలో నుజ్జయిన వ్యాన్

తాళ్లరేవు: జాతీయ రహదారి–216లోని పి.మల్లవరం జంక్షన్ సమీపంలో ఐస్ ఫ్యాక్టరీ వద్ద గురువారం తెల్లవారుజామున లారీ, వ్యాన్ ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ఘటనలో ఆయా వాహనాల డ్రైవర్లకు గాయాలయ్యాయి. కోరంగి ఎస్సై పి.సత్యనారాయణ వివరాల మేరకు, అంబాజీపేట నుంచి శ్రీకాకుళానికి కొబ్బరిడొక్కల లోడుతో వెళుతున్న వ్యాన్, రావులపాలెం నుంచి బీహార్ వెళుతున్న చేపల లోడు లారీ తెల్లవారుజాము సమయంలో ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ఆత్రేయపురం గ్రామానికి చెందిన వ్యాన్ డ్రైవర్ కోటి వరప్రసాద్‌కు తీవ్ర గాయాలు కాగా, కృష్ణా జిల్లా గుడ్లవల్లేరుకు చెందిన లారీ డ్రైవర్ జుజ్జువరపు రవితేజకు స్వల్ప గాయాలయ్యాయి. స్థానికులు వీరిని కాకినాడ ప్రభుత్వాస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతున్నారు. కేసు నమోదు చేసినట్టు ఎస్సై తెలిపారు.

108 అంబులెన్స్‌కు సుస్తీ..


ఎంపీడీఓ కార్యాలయం వద్ద 108ను తోస్తున్న స్థానికులు

ప్రత్తిపాడు: దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర రెడ్డి మానస పుత్రికగా పేరొందిన 108కి సుస్తీ చేసింది. ఫోన్ చేయగానే కుయ్.. కుయ్ మంటూ వచ్చే 108 వాహనానికి అవస్థలు వచ్చిపడ్డాయి. ప్రత్తిపాడు మండల పరిషత్ కార్యాలయ ఆవరణలోని 108 వాహనం సాంకేతిక లోపంతో తరచూ స్టార్ట్ కానంటూ మొండికేస్తోంది. గతేడాది నవంబర్ నుంచి మరమ్మతుల కోసం ఎదురుచూస్తూనే ఉంది. సిబ్బంది చిన్న మరమ్మతులు చేయడం, బండి బయలుదేరడం అన్నట్టు సాగిపోతోంది. 108కు ఎవరైనా కాల్ చేస్తే.. ఆగమేఘాలపై వెళ్లాల్సిన అపర సంజీవనికి 'స్టారింగ్' కష్టాలు లొచ్చాయి. ఎవరైనా బండిని నెట్టుతారా అంటూ ఎదురుచూడడం నిత్యకృత్యమైంది. ఎప్పటిలాగే గురువారం బండి స్టార్ట్ కాకపోవడంతో ఇలా.. తలో చేయి వేస్తున్నారు.

మద్యం మత్తులో రత్నగిరికి ప్రయాణం

నలుగురిపై డ్రంక్ అండ్ డ్రైవ్ కేసు

అన్నవరం: రత్నగిరి ఘాట్ రోడ్‌లోని టోల్‌గేట్ వద్ద బుధవారం రాత్రి నిర్వహించిన తనిఖీల్లో.. మద్యం తాగి ఉన్న నలుగురిని సెక్యూరిటీ సిబ్బంది అడ్డుకుని పోలీసులకు అప్పగించారు. వివరాల్లోకి వెళితే, బుధవారం రాత్రి పది గంటల సమయంలో నలుగురు వ్యక్తులు కారులో రత్నగిరికి వెళ్లేందుకు టోల్‌గేట్ వద్దకొచ్చి టోల్ చార్జీ చెల్లించారు. ఆ కారును తనిఖీ చేసేందుకు సెక్యూరిటీ సిబ్బంది ప్రయత్నించగా వారు వేగంగా వెళ్లిపోయారు. సెక్యూరిటీ సిబ్బంది ఆ కారును వెంబడించి, ఘాట్ రోడ్ మధ్యలో అడ్డుకున్నారు. కారును తనిఖీ చేయగా, డైవర్ సహా, నలుగురు మద్యం సేవించి ఉన్నట్టు బ్రీత్ అనలైజర్‌లో తేలింది. కారులో మద్యం సీసాలు ఉన్నాయి. వారిని వెనక్కి పంపేందుకు ప్రయత్నించగా, సిబ్బందితో వారు వాగ్వాదానికి దిగారు. ఈ క్రమంలో సెక్యూరిటీ గార్డులు వారిని పట్టుకుని స్థానిక పోలీసులకు అప్పగించారు. వారిపై పోలీసులు డ్రంక్ అండ్ డ్రైవ్ కేసు నమోదు చేసి, కోర్టుకు హాజరుపర్చారు.